తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
30 మార్చి 2026
సంపుటి 03
సంచిక 171
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## ఐదు రాష్ట్రాలకు ఎన్నికల నగారా



- మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఏప్రిల్‌లో పోలింగ్ - మే 4న ఫలితాలు
- ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం - జాతీయ పార్టీల సవాలు
- కొత్త పొత్తులు మరియు కీలక అభ్యర్థుల వ్యూహాలు

డెస్క్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): భారతదేశంలో అత్యంత కీలకమైన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం మరియు పుదుచ్చేరిలలో ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కేంద్ర

➢ మిగతా 2వ పేజిలో..

## తిరుపతి రైల్వే స్టేషన్‌కు ప్రపంచ స్థాయి సౌకర్యాలు

- ప్రయాణికులకు మెరుగైన అనుభవం -- ఆధునికీకరణ పనులు వేగంగా
- అమృత్ స్టేషన్ పథకంతో రూపాంతరం



తిరుపతి, మార్చి 29 ( ప్రతినిధి): తిరుపతి రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయి ప్రయాణానికి అనుగుణంగా తీర్చిదిద్దే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అమృత్ స్టేషన్ పథకం కింద ఈ స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. రోజూ లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులు రాకపోకలు చేసే ఈ స్టేషన్‌లో సదుపాయాల పెంపు ప్రధాన లక్ష్యంగా అధికారులు పనులు చేపట్టారు. ఇప్పటికే పలు కీలక పనులు పూర్తి అయ్యాయి. ముఖ్యంగా

➢ మిగతా 2వ పేజిలో..



## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి కవిత మద్దతు

- గత ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగ క్షమాపణ
- సమస్య పరిష్కారం కోసం కఠిన హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్వహించిన ధర్నాకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులకు జాగృతి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో భాగంగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయినందుకు బహిరంగంగా క్షమాపణ కోరారు. ఆ సమయంలో జరిగిన తప్పుల్లో తనకూ భాగం ఉందని అంగీకరిస్తూ, ఉద్యోగులందరిని క్షమించాలని కోరారు. ఇది రాజకీయంగా అరుదుగా కనిపించే స్వీయ విమర్శగా నిలిచింది. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె

➢ మిగతా 2వ పేజిలో..

## అధిక సంపాదనే టార్గెట్



- మద్యం వ్యాపారంలో సిండికేటు గాళ్ళ మాయాజాలం
- లాభాల కోసం ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న వైనం
- తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టు షాపులకు ప్రోత్సహం
- ప్రజలను మత్తులో ముంచెత్తుతున్న... సిండికేట్ మాఫియా దారులు
- సిండికేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న ఎక్సైజ్ అధికారులు

**రాయపర్తి, మార్చి 29,తరంగాలు :** అధిక సంపాదనే టార్గెట్ చేసుకున్న మద్యం వ్యాపారులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు అని అనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదు. మద్యం వ్యాపారంలో సిండికేటు మాయాజాలం అంతా ఇంతా కాదు. అక్రమ సంపాదనే పరమావధిగా మద్యం మాఫియాదారులు పావులు కదుపుతున్నారు. ఎవరు కాదన్నా, అవునన్నా ఇది నూటికి నూరు శాతం నిజం అనక తప్పదు. ఎందుకంటే వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మద్యం దుకాణాల యజమానులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ... అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల జేబులకు చిల్లు కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారని మద్యం బాబులు ఆరోపిస్తున్నారు

స్థానిక అధికారపార్టీ నాయకుల అండతో వ్యవస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని మద్యం సిండికేట్ మాఫియాదారులు రోజు రోజుకు పేట్రేగిపోతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం వ్యాపారులు అక్రమ సంపాదనకు ఆశపడి గ్రామాల్లో బెల్టు దుకాణాలను పెంచి పోషిస్తున్నారు. మీరు ఎంతకైనా మద్యం అమ్ముకోండి...కానీ క్వార్టర్ కు రూ.20,ఆఫ్ కు 40, ఫుల్ కు 80, బీరుకు 20 రూపాయలు ఎమ్మార్పీ కంటే అదనంగా ఇవ్వండి. అంతా మేమే చూసుకుంటాం..మీ వద్దకు ఏ అధికారి రాకుండా మాదే భాద్యత అంటూ సిండికేట్ వ్యాపారులు గ్రామాల్లో బెల్ట్ షాపులకు ఆద్యం పోస్తున్నారు. అయితే ఎమ్మార్పీ కంటే మీరు అధికంగా

➢ మిగతా 2వ పేజిలో..

## అక్రమ మైనింగ్ వ్యవహారంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయింది



- అక్రమ మైనింగ్ ఆరోపణలపై తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత
- మంత్రి పొంగులేటిపై తీవ్ర విమర్శలు -- బీఆర్ఎస్ డిమాండ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై 20 కుంభకోణాల ఆరోపణలు
- హౌస్ కమిటీ లేదా హైకోర్టు న్యాయమూర్తితో

**విచారణ కోరిన హరీష్ రావు**

హైదరాబాద్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసే వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్‌లో పాల్గొన్నారని ఆరోపిస్తూ, ఈ విషయం ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు స్పష్టమైందన్నారు. టీవీల్లో వెలువడిన సమాచారంతో పాటు ముఖ్యమంత్రి

➢ మిగతా 2వ పేజిలో..

## తల్లిదండ్రుల రక్షణకు కొత్త చట్టం

- "పేరెంటల్ సపోర్ట్ బిల్లు-2026"పై సభలో చర్చ
- వృద్ధుల భద్రతకు కీలక ముందడుగు
- సమాజానికి బాధ్యతాయుత సందేశం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. శాసనసభలో మంత్రి ఆదిలూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టిన "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు-2026"పై సీఎం మాట్లాడారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత కల్పించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరించే వారికి భయం కలిగించడమే ఈ బిల్లుకు ఉద్దేశమని పేర్కొన్నారు. వృద్ధుల సంరక్షణలో ఇది కీలకమైన అడుగు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో బంధాలు, అనుబంధాలు తగ్గిపోతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం పేగు బంధాలను కూడా విస్మరించే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితులు సమాజానికి మేలు చేయవని వ్యాఖ్యానించారు. పిల్లలు, మహిళల రక్షణ కోసం ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. బాలల హక్కులు, మహిళల భద్రత, వృద్ధుల సంక్షేమానికి సంబంధించి దేశంలో పలు చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. శ్రవణ కుమారుడి కథను ఉదాహరణగా చెప్పిన సీఎం, తల్లిదండ్రుల పట్ల భక్తి, గౌరవం పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ప్రముఖ వ్యాపారవేత్త విజయ్

➢ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణలో గోసంరక్షణకు పక్కా ప్రణాళికలు

- ఎన్కేపల్లిలో అత్యాధునిక గోశాల నిర్మాణం
- జంతు సంక్షేమ చర్యలపై సమగ్ర సమీక్ష
- మేనకా గాంధీ ప్రశంసలు -- ప్రభుత్వానికి అభినందనలు

హైదరాబాద్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణలో గోవుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గోసంరక్షణకు అవసరమైన

➢ మిగతా 2వ పేజిలో..

# తిరుపతి రైల్వే స్టేషన్‌కు ప్రపంచ స్థాయి సౌకర్యాలు

➢ మొదటి పేజీ తరువాయి

దివ్యాంగజనుల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం ద్వారా వారికి సౌలభ్యం కల్పించారు. అలాగే ఎయిర్ కాంకోర్స్ నిర్మాణం పూర్తవడంతో ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరమయ్యాయి. టికెట్ మరియు సహాయ కేంద్రాలను ఆధునికంగా రూపొందించి, వేగవంతమైన సేవలు అందిస్తున్నారు.

ర్యాంపుల ఏర్పాటు ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలతో వచ్చే కుటుంబాలకు సౌకర్యం పెరిగింది. స్టేషన్‌లోని మార్గాలను సులభంగా చేరుకునేలా ఈ సదుపాయాలు రూపుదిద్దుకున్నాయి. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నారు.

ఇంకా పలు పనులు కొనసాగుతున్నాయి. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే ప్లాట్‌ఫారమ్‌ల మధ్య ప్రయాణం మరింత సులభం అవుతుంది. అలాగే పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను ఆధునికీకరించడం ద్వారా సమాచారం స్పష్టంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ప్లాట్‌ఫామ్ షెల్టర్లు, పార్కింగ్ సదుపాయాల విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. వర్షం, ఎండ నుండి రక్షణ కల్పించేలా షెల్టర్లను నిర్మిస్తున్నారు. వాహనదారులకు సరిపడా పార్కింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత తిరుపతి రైల్వే స్టేషన్ దేశంలోనే అత్యుత్తమ స్టేషన్లలో ఒకటిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి అనుభవం కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఇది ప్రాంతీయ అభివృద్ధికి కూడా తోడ్పడనుందని తెలిపారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి కవిత మద్దతు

ఆరోపించారు. ప్రభుత్వంపై అదనపు భారం లేకుండా సమస్యలను పరిష్కరించే మార్గాలు ఉన్నప్పటికీ, ఏజెన్సీలకు మద్దతు ఇస్తూ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మధ్యవర్తి ఏజెన్సీలను తొలగించి, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించే విధానం తీసుకురావాలని సూచించారు. ఈ విధానం అమలు చేస్తే ఉద్యోగులకు భద్రత, హక్కులు కల్పించవచ్చని తెలిపారు.

మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల ద్వారా ఎంపికైనప్పటికీ వారికి సరైన హక్కులు, సౌకర్యాలు అందడం లేదని పేర్కొన్నారు. కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని అన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్ వీధుల్లో భారీ స్థాయిలో ఉద్యోగులు మార్చ్ చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించాల్సి వస్తుందని తెలిపారు. సమస్యకు పరిష్కారం దొరికే వరకు పోరాటం కొనసాగుతుందని, జాగృతి తరఫున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్ వ్యవహారంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయింది

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కూడా ఈ అంశం బహిర్గతమైందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయిందని, డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని హరీష్ రావు విమర్శించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అవినీతిపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిజాలను దాచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీలో అక్రమ మైనింగ్‌పై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని, అదే సమయంలో సీబీసీఐడీ విచారణ అంటూ ప్రభుత్వం ముందుకు రావడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ అంశంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసినప్పటికీ, ప్రభుత్వం స్పందించలేదని హరీష్ రావు అన్నారు. నిష్పక్షపాత విచారణ కోసం హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో విచారణపై ప్రజలకు నమ్మకం ఉండదని స్పష్టం చేశారు.

దళితుల అంశాన్ని కూడా హరీష్ రావు ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై కపట ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దళిత సంక్షేమానికి భారీ నిధులు కేటాయించామని, ప్రస్తుతం ఆ స్థాయిలో కేటాయింపులు లేవని తెలిపారు. దళితబంధు వంటి పథకాల ద్వారా బీఆర్ఎస్ నిజంగా దళితుల అభివృద్ధికి కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేతలపై ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కౌశిక్ రెడ్డిపై జరిగిన చర్యలను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ వ్యవహారాన్ని కూడా ప్రశ్నిస్తూ, ఇది రాజకీయ కుట్రలో భాగమని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక కుంభకోణాలు జరిగాయని హరీష్ రావు ఆరోపించారు. మొత్తం 20 స్కాములపై ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్ వల్ల రాష్ట్ర ఖజానాకు వందల కోట్లు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని, ప్రజల ముందుకు నిజాలను తీసుకువస్తామని స్పష్టం చేశారు.

## తల్లిదండ్రుల రక్షణకు కొత్త చట్టం

పథ్ సింఘానియా జీవితాన్ని ప్రస్తావిస్తూ, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే పరిణామాలను సభకు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. ఈ బిల్లుతో వృద్ధ తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అన్ని పక్షాలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

# ఐదు రాష్ట్రాలకు ఎన్నికల నగారా

➢ మొదటి పేజీ తరువాయి


ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, అస్సాం, కేరళ మరియు పుదుచ్చేరిలలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న ఎన్నికలు జరగనుండగా, పశ్చిమ బెంగాల్‌లో మాత్రం ఏప్రిల్ 23 మరియు 29 తేదీల్లో రెండు విడతలుగా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఐదు ప్రాంతాల్లోని మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఈ ఎన్నికల ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసి, ప్రచారం జోరందుకుంది.

తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ఆసక్తికరమైన మార్పులు కనిపిస్తున్నాయి. అధికార డిఎంకె తన పట్టును నిలబెట్టుకోవడానికి ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలో వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే 164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన డిఎంకె, తన మిత్రపక్షాలతో కలిసి బరిలోకి దిగుతోంది. మరోవైపు ఏఐఏడీఎంకె ఈసారి బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా పవర్‌లోకి రావాలని ప్రయత్నిస్తోంది. తాజాగా మార్చి 29న విడుదల చేసిన జాబితాలో మాజీ మంత్రులకు పెద్దపీట వేసింది. వీరికి తోడుగా సినీ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం' పార్టీ ఒక వైల్డ్ కార్డ్ ఎంట్రీలా మారి, సంప్రదాయ ఓటు బ్యాంకుకు గండికొట్టేలా కనిపిస్తోంది. ఇది ద్రవిడ రాజకీయాల్లో ఒక కొత్త మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, బీజేపీ అక్కడ గట్టి పోటీనిస్తోంది. సువేందు అధికారి వంటి బలమైన నేతలు మమతా బెనర్జీకి సవాలు విసురుతున్నారు. గతంలో ఎనిమిది విడతలుగా జరిగిన బెంగాల్ ఎన్నికలు, ఈసారి కేవలం రెండు విడతల్లోనే ముగియడం విశేషం. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించాలని చూస్తుండగా, యూడీఎఫ్ మరియు ఎన్డీయే కూటములు ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై ఆశలు పెట్టుకున్నాయి. అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అభివృద్ధి మంత్రంతో దూసుకుపోతుండగా, ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ప్రాంతీయ పార్టీలు 'అసోం సన్మిలితో మోర్చా' పేరుతో ఏకమై గట్టి పోటీనిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఈసారి భద్రత మరియు పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును వెలువరించనున్నారు. సుమారు 25 లక్షల మంది ఎన్నికల సిబ్బంది మరియు 4.85 లక్షల మంది భద్రతా దళాలను ఈ ఐదు రాష్ట్రాల్లో మోహరించారు. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు మరియు ఇతర తాయిలాల పంపిణీపై ఈసీ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 400 కోట్లకు పైగా అక్రమ నగదు మరియు వస్తువులను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అభ్యర్థుల గుర్తింపు కోసం బ్యాలెట్ పేపర్లపై రంగుల ఫోటోలను ముద్రించడం వంటి నూతన మార్పులను కూడా ఈసారి ప్రవేశపెట్టారు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రాంతీయ పార్టీల బలం పెరగడమా లేక జాతీయ పార్టీల ప్రాభవం పెరగడమా అనేది మే 4న తేలిపోనుంది. ఎగ్జిట్ పోల్స్‌పై ఇప్పటికే ఏప్రిల్ 29 వరకు నిషేధం విధించడంతో, ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందనేది ఉత్కంఠగా మారింది. ప్రజా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు మరియు అభివృద్ధి అంశాలే ప్రధాన అజెండాగా పార్టీలు ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ప్రశాంతంగా ముగిసేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

# అధిక సంపాదనే టార్గెట్






➢ మొదటి పేజీ తరువాయి

చెల్లించే డబ్బులలో సంబంధిత పోలీస్, ఎక్సైజ్ అధికారులకు కూడా ముట్ట చెబుతున్నామని వైన్స్ యజమానులు బహుబటంగానే చెబుతున్నారు. దింతో మారుమూల పల్లెల్లో సైతం మద్యం ఎరులై పారుతుంది. గ్రామాల్లో సమయం సందర్భం లేకుండా 24 గంటలు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నడంతో మధ్యతరగతి ప్రజలు యువత పెడదారిన పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే నెల నెల ప్రభుత్వమిచ్చే జీతభత్యాలు తీసుకుంటూ ఎక్సైజ్ అధికారులు మద్యం మాఫియాకు కొమ్ము కాయడం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మద్యం మాఫియాకు కొమ్ముకాస్తున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణలో గోసంరక్షణకు పక్కా ప్రణాళికలు

➢ మొదటి పేజీ తరువాయి



సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ఆలయాల సమీపంలో కూడా గోశాలలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు. గోవుల సంరక్షణకు దీర్ఘకాలిక పరిష్కారం అందించే విధంగా ఈ ప్రాజెక్టులను రూపుదిద్దుతున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రముఖ జంతు హక్కుల కార్యకర్త, పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షురాలు మేనకా గాంధీ బృందం ముఖ్యమంత్రిని శాసనసభలో కలిసింది. ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల నిర్వహణ, గోసంరక్షణ కోసం చేపట్టిన చర్యలను అధికారులు వివరించారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియను ఎలా అమలు చేస్తున్నారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జంతు సంక్షేమం కోసం తీసుకుంటున్న క్షేత్రస్థాయి చర్యలను కూడా వివరించారు.

జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న చొరవను ఆమె అభినందించారు. జంతువుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను కొనియాడారు. గోసంరక్షణతో పాటు వీధి జంతువుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జంతు సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



అక్రమ మైనింగ్ ఆరోపణలపై కేటీఆర్ ఫైర్
హౌస్ కమిటీ లేదా న్యాయ విచారణ కోరుతూ హెచ్చరిక
గవర్నర్‌ను కలుస్తామని, ప్రజల్లోకి వెళ్తామని బీఆర్ఎస్ స్పష్టం

హైదరాబాద్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి): రాష్ట్రంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ అసెంబ్లీ వద్ద గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో నిరసన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు ఆధారాలతో సహా ఒక మంత్రి కుటుంబానికి చెందిన సంస్థ అక్రమ మైనింగ్‌కు పాల్పడిందని బయటపెట్టారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్ల ఆధారంగానే ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. ఇతర సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకున్న ప్రభుత్వం, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై మాత్రం చర్యలు తీసుకోవడంలేదని కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి కుటుంబానికి చెందిన సంస్థ కావడం వల్లనా, లేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఉండడం వల్లనా చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల్లో విరుద్ధతలు ఉన్నాయని విమర్శించారు. అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని కేవలం చిన్న మొత్తంగా చూపించడం సిగ్గుచేటని కేటీఆర్ అన్నారు. అధికారుల దాడుల్లో బయటపడిన వివరాలను ప్రస్తావిస్తూ, రెండున్నరేళ్లలో జరిగిన అవినీతి పరిమాణం భారీగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన మైనింగ్ ఆదాయంలో భారీ లోటు ఉందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సభా సంఘం ఏర్పాటు చేసి మంత్రి, ముఖ్యమంత్రి సహా అందరి పాత్రలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఓబులాపురం మైనింగ్ కేసులో హౌస్ కమిటీ ఏర్పాటు చేసినట్లే ఇప్పుడు కూడా పారదర్శక విచారణ జరపాలని కోరారు. అవసరమైతే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సూచించారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదని, అవసరమైతే ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా తీసుకెళ్తామని హెచ్చరించారు. మంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 30 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## సుడిమళ్ళ లో అడ్డగోలుగా నిర్మాణాలు

- ఏజెన్సీ చట్టాలకు తూట్లు
- అక్రమ నిర్మాణాలపై ముఖం చాటేస్తున్న పంచాయతీ రెవిన్యూ అధికారులు



**ఇల్లందు ప్రతినిధి మార్చి 29,( తరంగాలు):** ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చేతులెత్తేసినట్లే కనిపిస్తున్నారు అని ఆదివాసి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అక్రమ నిర్మాణ లు జోరుగా సాగుతున్న వాటిపై చర్యలు తీసుకోవలసిన పంచాయతీ, రెవెన్యూ అధికారులు మౌనం వహించడంపై అనేక విమర్శలకు తావిస్తుంది.పంచాయతీ,రెవిన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసిన, మీడియా కథనాలు వచ్చిన అధికారులు స్పందించకుండా నిర్మాణదారులకు అధికారులే అండగా ఉన్నారనేది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదిమళ్ళ పంచాయితీ కార్యాలయం ముందు నుండి అక్రమ నిర్మాణాలకు వేల టిప్పుల మట్టి తోలకాలు నిర్వహిస్తున్న వాటిని నిలువరించకుండా పంచాయతీ అధికారి ఉండటం వెనక అంతర్యం ఏమిటో అంటూ ప్రశ్నిస్తున్న ఆదివాసి సంఘాలు.1/70 చట్టానికి తూట్లు పొడిచి ఏజెన్సీ ప్రాంతంలో వెంచర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారని అన్నారు. ప్రధాన రహదారి పక్కన నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు సాగిస్తున్న అధికారుల మౌనం పై ఆగ్రహిస్తున్నారు. ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టిన వాటిపై గతంలో ఎల్. టి. ఆర్ (ల్యాండ్ ట్రాన్స్ఫర్ రెగ్యులేషన్) కేసులు నమోదు అయ్యాయని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో హక్కులను కాపాడాల్సిన అధికారులు ఆ హక్కుల పాలిటీ శాపంగా మారారని మండిపడ్డారు. వెంటనే అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరారు.

## ఘనంగా మామిడి శివ మున్నాఫ్ పుట్టినరోజు వేడుకలు



**ఇల్లందు ప్రతినిధి మార్చి 29, ( తరంగాలు )** ఇల్లందు పట్టణంలోని ఏక్త హౌస్ కార్యాలయంలో. తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో. ఏక్త హౌస్ టీం సభ్యులైనటువంటి మామిడి శివ, మున్నాఫ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏక్త హౌస్ టీం సభ్యులు,ముడత అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ కరువు

- మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు - కర్నాటి పార్వతమ్మ
- నర్సంపేట పట్టణ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి- దేవినేని జ్యోతి



**తరంగాలు, మార్చి:29, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలాంబ, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాలలో మహిళలకు రక్షణ కరువైందని దేశవ్యాప్తంగా బిజెపి పార్టీకి చెందిన 44 మంది ఎంపీలు మరియు ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని ఆరోపించారు. మహిళలు అంటే గౌరవం లేని పార్టీ బిజెపి పార్టీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకవైపు మహిళలకు గౌరవం ఇవ్వాలని మాట్లాడుతుంటే దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళల పైన జరుగుతున్న అరాచకాల మీద మాత్రం పెదవి విప్పని మహిళా మంత్రులు భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం ప్రారంభించినప్పుడు 100 కోట్ల పైన ప్రకటనలకు ఖర్చు చేశారని అన్నారు. దేశంలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగినప్పుడు, దాడులు జరుగుతుంటే చూస్తూ నోరు విప్పని బిజెపి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కర్ర మాలతి, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఆర్గనైజర్ సెక్రటరీ కోతి మమత, నర్సంపేట పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెంది సక్కుబాయి, చెన్నారావుపేట మండల అధ్యక్షురాలు బండి పద్మ, దుగ్గొండి మండల అధ్యక్షురాలు బుర్రి సునీత, సంగం మండల అధ్యక్షురాలు బిక్కిరెడ్డి సంధ్య, నర్సంపేట మండల అధ్యక్షురాలు సురం సాంబ లక్ష్మి, గద్ద జ్యోతి, కల్పన, నల్ల శాంత, ఎండి హసీనా తదితరులు పాల్గొన్నా

## వి.జె.సి.ఎం.చర్చ్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల పండుగ



**ఇల్లందు ప్రతినిధి మార్చి 29, ( తరంగాలు):** సుదిమళ్ళ పంచాయతీ హనుమంతులపాడు గ్రామంలో క్రైస్తవలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే మట్టల పండుగ ఈరోజు వి.జె.సి. ఎం.చర్చ్ పాస్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి యేసుక్రీస్తు యెరూషలేములో ప్రవేశించిన సందర్భంగా ఈ పండుగను ఆచరించారు. ఉదయం నుంచే చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కొబ్బరి చెట్టు ఆకులు (మట్టలు) చేతబట్టి ఊరేగింపులు నిర్వహించడం ఈ పండుగలో ప్రత్యేకతగా నిలిచింది. పిల్లలు, మహిళలు, పెద్దలు సమూహంగా పాల్గొని భక్తి గీతాలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. పాస్కా పండుగకు ముందుగా వచ్చే ఈ మట్టల ఆదివారం క్రైస్తవులకి ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. పాపక్షమ కోసం ప్రార్థనలు చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.మట్టల పండుగను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందంగా జరుపుకున్నారు.

## ఇల్లందులో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు



**ఇల్లందు ప్రతినిధి మార్చి 29,( తరంగాలు):** ఈ రోజు ఇల్లందులో తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల అధ్యక్షులు పుట్టా ఉపేందర్ యాదవ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇల్లందు పట్టణ బుగ్గవాగు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్టీఆర్ కి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ ఇల్లందు మండల అధ్యక్షులు పుట్టా ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ,కూడు, నీడ నినాదం తో పేదవారి కోసం టీడీపీ పార్టీని స్థాపించారని అన్నారు . అలాగే రెండు రూపాయలకే 1కేజీ బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు, ఆడ బిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు( వాట) ఇవ్వాలని చట్టం తీసుకురావడం జరిగిందని అన్నారు. పెద బడుగు బలహీనవర్గాలకు కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్య దర్శి క్లింటు రొచ్, గుళ్ళ మొగిలి, టీడీపీ సీనియర్ నాయకులు కటకోజుల శ్రీనివాస్, మల్లెం పాటి మోహన్ రావు,భద్రం తది తరులు పాల్గొన్నారు.

## కడియం పై రౌడీయయిూజం కౌశిక్ రెడ్డిని సస్పెండ్ చేయాలంటూ కాంగ్రెస్ నేతల డిమాండ్

- అసెంబ్లీ అంచులపై ప్రతిధ్వనించిన అవమానం
- ప్రజాస్వామ్య గుండెల్లో మిగిలిన గాయం

**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 29,(తరంగాలు ):** మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల ఐలయ్య ఆధ్వర్యంలో, విలేకరుల సమావేశంలో ఐలయ్య పాక్స్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు ఆవేదనతో, ఆగ్రహంతో గళమెత్తిఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.మచ్చలేని నాయకుడు కడియం శ్రీహరి పై జరిగిన అవమానంసామాన్య ఘటన కాదని,ప్రజాస్వామ్యాన్ని తలవంచించే చీకటి క్షణమని పేర్కొన్నారు. దళిత నాయకుడిపై దుర్వ్యవహారం సభను అవమానించే అసభ్య ప్రవర్తన విలువలను తుంచే నిర్లక్ష్య ధోరణిఇవి అన్నీ కలిపి ప్రజాస్వామ్యంపై మచ్చలని స్పష్టం చేశారు.ఆయన గళం వినిపించింది.క్షమాపణ వెంటనే రావాలి,తప్పిదానికి కఠిన శిక్ష తప్పదు,ప్రజాస్వామ్యం నిలవాలి. విలువలు గెలవాలి.నాయకత్వం అంటే నీతినాయకత్వం అంటే నిబద్ధత బెదిరింపులు కాదు, బలమైన విలువలు ఈ సందర్భంగా జఫర్గఢ్ మండలం గళమెత్తింది.సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు,కడియం శ్రీహరి అభిమానులు ఒక్కటైఅన్యాయానికి వ్యతిరేకంగా అగ్గిపుల్లలయ్యారు

పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తూది ఒక్కరి అవమానం కాదు

ప్రజాస్వామ్యానికి చేసిన ద్రోహం అని ఘోషించారు.



## ఘనంగా టిడిపి 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి,పార్టీ జెండా ఆవిష్కరించిన మండల పార్టీ అధ్యక్షులు కొత్త వెంకట నాగ సురేష్



**తరంగాలు, మార్చి:29, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి** :నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు కొత్త వెంకట నాగ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె.వి.ఎన్ సురేష్ మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలపడానికి, బడుగుల చేతికి పాలనాధికారం ఇవ్వడానికి, నిరుపేదకు ఆనందంగా జీవించే హక్కును కలిగించడానికి 1982 మార్చి 29 వ తేదీన తెలుగుదేశం పార్టీ స్థాపిస్తునట్లు ఎన్టీఆర్ ప్రకటించారన్నారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ తెలుగు జాతి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన పార్టీ అని పార్టీ స్థాపించిన నాటి నుండి అనేక రికార్డులు నెలకొల్పిందని సామాన్యులను చట్టసభలకు పంపించిన ఘనత తెలుగుదేశం పార్టీ దేనని అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే తెలుగుజాతి అస్తిత్వ పోరాటం, భాష సంస్కృతుల పరిరక్షణ ఉద్యమం, తెలుగుజాతి ఆత్మగౌరవ పతాకంగా సగర్వంగా ఎగురుతున్న తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రస్థానం అన్నారు. తెలుగుదేశం పార్టీ ద్వారా ఎన్టీఆర్ అనేక సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని పేదలందరికీ అందించారన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి చిహ్నంగా తెలుగుదేశం ఆవిర్భవించి నేటికి 44 వసంతాలు తెలుగువారి గుండెల్లో ఆత్మగౌరవాన్ని పురికొల్పింది. ప్రపంచం మొత్తం తెలుగువారి గురించి మాట్లాడుకునేలా చేసింది. తెలుగు చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిందన్నారు. సమాజమే దేవాలయం --- ప్రజలే దేవుళ్ళు అనే సరికొత్త నినాదంతో తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి ఇనుమడింపజేసింది. నేటికీ కోటి మంది కార్యకర్తలతో రెండు తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద కుటుంబంగా ఏర్పడి 44 వసంతాల పండుగను ఘనంగా నిర్వహించుకుంటుందన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవ పతాకం తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేములపల్లి సూర్య ప్రకాష్ రావు, చలసాని రాము, యార్లగడ్డ సుబ్బారావు, యార్లగడ్డ పిచ్చేశ్వర రావు, గూడూరు రాజు, మేక నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## మట్టల ఆదివారం సందర్భంగా మానుకోటలో ఘనంగా ర్యాలీ

- హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్ పాస్టర్ అనుదీప్ ఢ అభిషేక్

**•మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి, మార్చి,29,** తరంగాలు:మానుకోట పట్టణంలో



ఆదివారం స్థానిక ఎల్షదాయి చర్చ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారంను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. సంఘ విశ్వాసులు అందరూ కలిసి ఈత మట్టలను సేకరించి, వాటిని పూలతో అందంగా అలంకరించి "హోసన్నా జయమే" అంటూ ఘనంగా నినాదాలు చేశారు.ఈ ర్యాలీ కోర్టు సెంటర్ నుండి ప్రారంభమై తొర్రూర్ బస్టాండ్, నెహ్రూ సెంటర్ మీదుగా కొరివి గేట్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలో ప్రజలు గుమికూడిన ప్రాంతాల్లో చర్చి పాస్టర్ అనుదీప్ సువార్త బోధిస్తూ, యేసు క్రీస్తు మహిమను వివరించారు. మానవ పాప పరిహారార్థం కన్యక గర్భంలో జన్మించి, పాపరహిత జీవనానికి ఆదర్శంగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.అనంతరం ప్రజలందరి క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అభిషేక్, ఎస్తేరు జయశ్రీ, ఉదయశ్రీ, స్టీఫెన్, డాక్టర్ రవికుమార్, భరత్, ప్రవీణ్, యోసేపు, శాంతి, రూతమ్మ, నిర్మల, లలిత, నిహారిక, యేసుపుష్ప, సరోజ, ఎస్తేరు సుభద్ర, వరప్రసాద్, లావణ్య, ఐజక్, శామ్యూల్, ఏసుమణి, కీర్తన, సంజన, కృష్ణమనోహర్, శ్యాంకిషోర్, రమేష్, వనిత, మత్తయి, పేతురు, మరియమ్మ, ప్రియ, నిస్సీ, జోసెఫ్, సుకన్య, వంశీ పాల్ తదితరులు పాల్గొన్నారు.



## పాడి కౌశిక్ రెడ్డిని సభ నుండి సస్పెండ్ చేయాలి

- తక్షణమే సభ వ్యవహారాలను ఉల్లంఘించిన కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి
- వెంటనే కడియం శ్రీహరికి క్షమాపణ చెప్పాలి
- స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 29,(తరంగాలు):** తెలంగాణ శాసనసభలో మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతుండగా భారాస పార్టీ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అసభ్యకరంగా అవమానకరంగా అనుచితంగా వ్యవరించి గన్ తో కాల్చిపడేస్తానంటూ చేయితో సైగలు చేస్తూ బెదిరించడం హేయమైనా చర్య దీన్ని ఖండించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య . ఒక దళిత సామాజిక వర్గానికి చెందినటువంటి ఒక సీనియర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి 40 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మరియు తెలంగాణ రాష్ట్రంలో అనేక శాఖలలో మంత్రిగా పనిచేసి అవినీతి మరక లేని నాయకుడుగా పేరు తెచ్చుకున్న నీతి నిజాయితీ నిబద్ధత గల ఒక శాసనసభ్యుడు పట్టుకొని నిండు శాసనసభలో అనుచితంగా వ్యవహరించడం సభా మర్యాదలకు విలువ ఇవ్వని కౌశిక్ రెడ్డిని భర్త్ రఫ్ చేయాలి.కౌశిక్ రెడ్డి రాజకీయ జీవితమే బ్లాక్ మేయిల్ ఎన్నికల సమయంలో కుటుంబాన్ని ముందు ఉంచి ఓటు వేయకపోతే చనిపోతా అనీ ఇవాళ నువ్వు శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత ని రౌడీ రాజకీయాలతో పోలీసు అధికారులని బెదిరిస్తూక్వారీ వ్యాపారులను బెదిరిస్తూ చివరకి సొంత పార్టీ వాళ్ళే ప్రెస్ మీట్ పెట్టి మీ నాయకత్వం వద్దు అంటున్నారు. అంటే నువ్వు ఎంత సైకొవో అర్ధమవుతుంది. బిడ్డ తస్మాత్ జాగ్రత్త వెంటనే మా శాసనసభ్యులు శ్రీ కడియం శ్రీహరికి, నిండు శాసనసభ కి క్షమాపణ చెప్పాలి.

## ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- అలియబాద్ దళితులకు ఇచ్చినా హామీలను నెరవేర్చి పట్టాలు ఇవ్వాలి
- ప్రభుత్వ భూమిలో జెండాలు పతినా సీపీఐ
- సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి జువారి రమేష్‌లి



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 29,(తరంగాలు):** మండలంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అలియబాద్ రెవెన్యూ శివారు లోని 10 వ సర్వేనెంబర్లో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అలియబాద్ లో ఉన్న దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో జెండాలు పాతడం జరిగిందని సిపిఐ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జువారి రమేష్ తెలిపారు.ఈసందర్భంగా సిపిఐ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జువారి రమేష్ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని. జఫర్గడ్ మండలంఅలియబాద్ రెవెన్యూ లో దళితులకు హక్కు పత్రాలు ఇచ్చారు.కానీ ఇప్పటివరకు భూమి చూయించని పరిస్థితులు ఉన్నాయన్నారు దళితులకు పట్టాలు ఇవ్వలని అన్యాక్రాంతం అయినా భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో ఇప్పటికే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అక్రమ దారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వెంటనే స్పందించి ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని పార్టీ ఆధ్వర్యంలో జెండాలు పాతడం జరిగిందని తెలిపారు. లేనిపక్షంలో సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలకు ఆ భూములు గుడిసెలు వేయించి పేదలకు పంచడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్,మహిళా సంఘం మండల నాయకులు ఎండి నూర్జిస, కలకోట ప్రభాకర్, రాడపక సత్తయ్య, మంద బుచ్చయ్య ,వేల్పుల పెద్ద రాములు, నక్క బిక్షపతి,నక్క ఎల్లమ్మ, కుంటాల వెంకటయ్య, మెడ నిర్మలా, కుంటాల మనిలా, ఎండీ జాఫర్,కుంటాల సువర్ణ,కుంటాల ఎల్లమ్మ,ఉప్పాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



## దీన్ దయాళ్ బాటలో వెలుగుల భారత్






- దేశ నిర్మాణం - పండిట్ దీన దయాళ్ సమగ్ర మానవతా దృక్పథం
- -బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ ప్రతినిధి, మార్చి 29,తరంగాలు** :పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం వరంగల్ జిల్లా కాశీబుగ్గ మండలంలో ఘనంగా నిర్వహించారు.ఈ శిక్షణ శిబిరంలో మండల అధ్యక్షులు అపురూప రజనిష్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ కార్యకర్తల్లో సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత బలోపేతం, ప్రజలతో మమేకం కావడం వంటి పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పై మార్గదర్శనం చేశారు.భారత ప్రభుత్వం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఇంటిగ్రల్ హ్యూమనిజం ఫిలాసఫీ ఆధారంగా ఆత్మనిర్భర్ భారత్, అంత్యోదయ భావనలతో సుమారు 740 సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పండిట్ దీన్ దయాళ్ తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద ఈ రోజు స్వశక్తి, స్వదేశీ, స్వాభిమానం, స్వావలంబనలతో భారత్ ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని గంట రవికుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా సైదాంతిక భూమిక కాలాంశంలోభాగంగా కార్యకర్తలతో ప్రసంగిస్తూ.. మానవుని శరీరం, మనస్సు, బుద్ధి మరియు ఆత్మల కలయికగా పరిగణించే ఒక సమగ్ర దృక్పథం. పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానం మరియు సామ్యవాదం రెండింటికీ ప్రత్యామ్నాయంగా భారతీయ మూలాలతో కూడిన ఏకాత్మ మానవతవాదం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని తెలియజేశారు. సమాజంలో చిట్టచివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలనేదే అంత్యోదయ సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సిద్ధాంతం నిరుపేదల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. అలాగే కార్యకర్తలలో పార్టీ సిద్ధాంతాల పట్ల స్పష్టతను పెంపొందించడం, దేశాభివృద్ధిలో భారతీయత మరియు సాంస్కృతిక జాతీయవాదం యొక్క ప్రాముఖ్యతను వివరించడం ఈ శిక్షణా తరగతుల ప్రధాన లక్ష్యం, భారతీయ సంస్కృతి, విలువల ఆధారంగా దేశాన్ని బలోపేతం చేయడం మరియు స్వదేశీ ఆర్థిక నమూనాను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ మహాభియాన్ దృష్టి సారిస్తుందని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, జిల్లా నాయకులు ఎరుకల రఘునారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు బొడ్డు రాకేష్, మామిడాల సతీష్, బీజేపీ సీనియర్ నేతలు సిద్దోజు శ్రీనివాస్, అల్లి అజయ్, సాంబరాజు ప్రభాకర్, రాఘవాచారి, ముచర్ల ప్రభాకర్, గుర్రపు సత్యనారాయణ, పగడాల సుదర్శన్, భవాని శంకర్, మడిపెల్లి నాగరాజు, కందుకూరి శ్రీనివాస్, దీప ఠాగూర్ మరియు మండల, డివిజన్ల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పరీక్షల ఒత్తిడిని జయించండి

- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వర్ధన్నపేట ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్




**వర్ధన్నపేట ప్రతినిధి,29 మార్చి, తరంగాలు :** పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే... భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే విజయం సాధ్యమే అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఆదివారంవర్ధన్నపేటలోని ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌నుకలెక్టర్ సందర్శించారు.విద్యార్థినులతో మమేకమై వారి చదువు, పరీక్షల సన్నాహాలు, హాస్టల్ సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్ మరియు పరీక్షలపై విద్యార్థులకు కలెక్టర్ అవగాహన కల్పిస్తూ క్రమశిక్షణ,సమయపాలన, పట్టుదలతో చదువుకుంటూ పాఠాలను పునరావృతం చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.ఒత్తిడికి లోనుకాకుండా సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, అవసరమైనప్పుడు ఉపాధ్యాయులు, వార్డెన్లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సరైన నిద్ర, పోషకాహారం, వ్యాయామం కూడా మానసిక ప్రశాంతతకు ఎంతో దోహదపడతాయని వివరించారు.జిల్లాలోని మండలాల స్పెషల్ ఆఫీసర్ల ద్వారా ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ విద్యాసంస్థలలో విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్ మరియు పరీక్షలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పరీక్షల భయాన్ని తొలగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోనిస్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, అవసరమైన సరుకుల నాణ్యత, నిల్వ విధానం సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు అనుకూలమైన చదువు వాతావరణం కల్పించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీబీసీడీవో పుష్పలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, హాస్టల్ వార్డెన్, సంబంధిత శాఖల అధికారులు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలో దళిత నాయకుడిపై దౌర్జన్యం కౌశిక్ రెడ్డిని వెంటనే భర్తరఫ్ చేయాలి తీగల నాగరాజ్





**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 29,(తరంగాలు** ):మచ్చలేని నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అసెంబ్లీలో మాట్లాడుతున్న సమయంలో, హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు, మాట్లాడిన భాష తీవ్రంగా ఖండనీయం.నిండు సభలో ఒక దళిత విద్యావేత్త అయిన ఎమ్మెల్యేను గన్‌తో కాల్చి పడేస్తా" అంటూ చేయి సైగలతో బెదిరించడం అనేది అత్యంత హేయమైన చర్య. ప్రజాస్వామ్యానికి ఇది పెద్ద అవమానం. ఒక ప్రజాప్రతినిధి ఇలా ప్రవర్తించడం అనేది అసెంబ్లీ గౌరవాన్ని దిగజార్చే పని.అంతేకాకుండా, ఎన్నికల సమయంలో ఓటమి వస్తే ప్రాణాలు తీసుకుంటానని, భార్య పిల్లలను ముందుకు తెచ్చి భావోద్వేగ బ్లాక్‌మెయిల్ చేయడం, చిన్న పాపను రాజకీయాల్లోకి లాగడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా, పార్టీ నాయకత్వ దృష్టిలో పడటానికి ఇలాంటి తీరును అవలంబించడం అత్యంత బాధాకరం.అసెంబ్లీలో దళితుల పట్ల అవమానకరంగా, అనుచితంగా వ్యవహరించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వైఖరిని ఖండిస్తూ వెంటనే అదే సభలో కడియం శ్రీహరికి శాసనసభకు క్షమాపణ చెప్పాలి.స్పీకర్ తక్షణమే పాడి కౌశిక్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకొని, ఎమ్మెల్యే పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాను. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి దళితుల గౌరవం రక్షించాలి.తీగల నాగరాజ్తెలంగాణ యువజన కాంగ్రెస్స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి తీగల నాగరాజు.

# దళిత నాయకత్వంపై బి ఆర్ యస్ ఎ మ్మెల్యే అరాచకం

- కేసీఆర్, కేటీఆర్ వెంటనే దళి సమాజానికి క్షమాపణ చెప్పాలి
- మాజీ డిప్యూటీ సీఎంను అవమానించిన పాడి కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని పూర్తిస్థాయిలో రద్దు చేయాలి:
- రడపాక దానియేల్
- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



జఫర్గడ్ ప్రతినిధి , మార్చి 29, (తరంగాలు):అసెంబ్లీ సాక్షిగా సీనియర్ దళిత నాయకుడు కడియం శ్రీహరి ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సైగలతో బెదిరించి, అవమానించడం అత్యంత దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ నాయకులు రడపాక దానియేలు ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. తన ప్రకటనలో ఆయన వెల్లడించిన ముఖ్యాంశాలుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి సముచిత స్థానం కల్పిస్తోంది. ప్రజా పాలనలో సామాజిక న్యాయం జరుగుతుంటే, అది ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు అసూయతో ఇటువంటి అరాచకాలకు పాల్పడుతున్నారు. సభ్యత్వం పూర్తి రద్దు బర్తరఫ్ చేయాలి రాజ్యాంగబద్ధమైన సభలో అరాచక ప్రవర్తనకు పాల్పడిన పాడి కౌశిక్ రెడ్డిని కేవలం సస్పెన్షన్ చేయడమే కాకుండా, అతని శాసనసభ సభ్యత్వాన్ని పూర్తిస్థాయిలో రద్దు చేయాలి. ఒక సీనియర్ దళిత నాయకుడిపై ఇటువంటి సైగలు చేయడం యావత్ దళిత జాతికే అవమానం. ఇలాంటి సంస్కారహీనమైన ప్రవర్తన ఉన్న వ్యక్తికి ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదు. కేటీఆర్, హరీష్ రావుల మౌనం తమ కళ్లముందే ఒక సీనియర్ దళిత నాయకుడిని తమ పార్టీ ఎమ్మెల్యే సైగలతో బెదిరిస్తుంటే, పక్కనే ఉన్న కేటీఆర్,హరీష్ రావు వారించకుండా మౌనంగా ఉండటం అంటే.. ఆ అరాచకాన్ని వారు సమర్థిస్తున్నట్లేనని ధ్వజమెత్తారు.లి బీఆర్ఎస్ దళిత ద్రోహ చరిత్ర: నాడు దళిత ముఖ్యమంత్రి అని మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ ది అని దానియేలు విమర్శించారు. నేరెళ్లలో దళితులపై జరిగిన అమానుష దాడులు, చిత్రహింసల నుండి మొదలుకొని, మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్యని అవమానకర రీతిలో పదవి నుంచి తొలగించడం, దళితుల మూడు ఎకరాల భూమి మోసం వరకు బీఆర్ఎస్ చరిత్ర అంతా దళిత విద్వేషమేనని మండిపడ్డారు. నేడు దళిత ప్రజాప్రతినిధులను గౌరవించలేని అహంకారం వారిదని, బీఆర్ఎస్ అంటేనే 'దళిత వ్యతిరేక' పార్టీ అని ఈ ఘటనతో మరోసారి రుజువైందని ధ్వజమెత్తారు.కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే ప్రవర్తనకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరియు కేటీఆర్ వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి అరాచకాలను ఉపేక్షించదు అని హెచ్చరించారు.

# సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్




**హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ ప్రతినిధి , మార్చి 29,తరంగాలు** :సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్ అని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు.
పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని జమాతే ఇస్లామీ హింద్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ రాయపురాలోని బ్రైనీ స్టార్స్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఇశ్రత్ బాను, జిల్లా అధ్యక్షుడు సయ్యదా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, రంజాన్ నెల ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈద్ పండుగ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే పవిత్ర సందర్భంగా నిలుస్తుందని తెలిపారు. ఈద్ మిలాప్ వంటి కార్యక్రమాలు సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని పెంపొందిస్తూ, భిన్న మతాల మధ్య ఐక్యతను బలపరుస్తాయని పేర్కొన్నారు. మన సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలంటే పరస్పర గౌరవం, సహనం అత్యవసరమని, ప్రతి ఒక్కరూ సమాజ ఐక్యతకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ మహత్తర సంప్రదాయం అని, ఇలాంటి కార్యక్రమాలు ఆ విలువలను మరింత బలపరుస్తాయని అన్నారు.పండుగలు మనుషుల మధ్య దూరాలను తొలగించి హృదయాలను దగ్గర చేసే శక్తి కలిగివున్నాయని, ఈద్ మిలాప్ ఆ భావనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, ఐక్యత కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

# ప్రతి పేదవాడి ఇంటి కలను నెరవేరుస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి.మార్చి29 తరంగాలు ప్రతినిధి**
తలకొండపల్లి మండల్ లోవెంకటాపూర్ గ్రామపంచాయతీతాంద్ర వెంకటయ్య తండ్రి పేరు హనుమంతు ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ అండగా నిలిచి తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఫినిషింగ్ సిమెంట్ ఇవ్వడం జరిగింది.ఈ రోజు నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్థానిక మాజీ జడ్పిటిసి అయినా ఉప్పల వెంకటేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో నిరుపేదలకు ఒక దేవుడిలా ఇంటి నిర్మాణాలకు కావలసిన సామాగ్రిని తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న మనసున్న మారాజు ఉప్పల వెంకటేష్ అని అలాంటి వ్యక్తి కల్వకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా వస్తే కల్వకుర్తి నియోజకవర్గ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుజురి పుష్పమ్మ అంజన్ రెడ్డి.ఉప సర్పంచ్ చంద్రశేఖర్. మొగిలి చెట్టి మహేష్. గొర్రె మల్లేష్. మస్కా శేఖర్. బైరపాక ఇందిరమ్మ లాలయ్య. జరుపుల శ్రీను. ఆయిల్ పావనిశివకుమార్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి మార్చి 29 తరంగాలు ప్రతినిధి**
కల్వకుర్తి నియోజకవర్గం లోని వెల్దండ మండల కేంద్రంలోని 9వ వార్డులో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకట గౌడ్ భూమి పూజ చేసి సిసి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్దండ మండల కేంద్రంలో వారి సహాయ సహకారాల వల్ల ఈరోజు సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందని గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్. వార్డ్ సభ్యులు ముదికొండ కవిత రమేష్. కార్యదర్శి గిరి గౌడ్. నాయకులు పాలాది రంగనాథం. పసునోజు పురుషోత్తం. గుద్దటి కిష్టల్. మసిగుండ్ల పిల్లి దేవేందర్. వెంకటేష్. శిరూషన గండ్ల శేఖర్. మట్ట నాగేష్ గౌడ్. మోర వేణు. తుంగ శీను. మట్ట నాగార్జున. అన్నపు ప్రశాంత్. ఎండి ఖలీల్. ఎండి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కౌన్సిల్ సభ్యుడు మార్తినేని ధర్మారావును కలిసిన

- రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ



వరంగల్ ప్రతినిధి, మార్చి 29,తరంగాలు : జాతీయ కౌన్సిల్ సభ్యుడు మార్తినేని ధర్మారావును రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్ర అధికార ప్రతినిధి గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాజీ శాసనసభ్యులు - జాతీయ కౌన్సిల్ సభ్యుడు మార్తినేని ధర్మారావు ను రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ కలిశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గా వెంకటరమణ ఎన్నికైన సందర్భంగా మార్తినేని ధర్మారావు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు





**వరంగల్ ప్రతినిధి, మార్చి 29,తరంగాలు** : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్ పాయి, ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత శిఖరాలకు...

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి, త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని చెప్పారు.

రూ. 28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు.తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని, తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని, ఆ ప్రేరణతోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

### స్కిల్ ఉంటే అవకాశాలు అపారం...

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని, నైపుణ్యమే విజయానికి మూలమని పేర్కొన్నారు. ఏఐ మనుషులను భర్తీ చేయదని, కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రత్యేకత...

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమ్మేళనం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

### ఉన్నత హోదాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులు...

చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ నేడు సాంకేతిక విద్యలో విశిష్ట గుర్తింపు పొందింది. వేలాది మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచింది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాలను అధిరోహించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులుగా ఎదిగి కళాశాలకు కీర్తి తెచ్చారు. బీహెచ్ఈఎల్, ఎచ్ఏఎల్, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎచ్సీఎల్, డీఆర్‌డీవో, ఇస్రో, ఐడీపీఎల్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### చరిత్ర - అభివృద్ధి పథం

ఈ కళాశాల ప్రారంభదశలో అజంజాహి మిల్లు ప్రాంగణంలోని ఒక షెడ్డులో 120 మంది విద్యార్థులతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులతో ప్రారంభమైంది. 1955 జూలై 10న 16 ఎకరాల విస్తీర్ణంలో నూతన క్యాంపస్‌కు శంకుస్థాపన జరిగింది.ప్రస్తుతం కళాశాలలో 1620 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, 150 మంది అధ్యాపకులు, సిబ్బంది సేవలందిస్తున్నారు. 1995-96లో ఈసీఈ, కంప్యూటర్ కోర్సులు ప్రారంభమై, తరువాత సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు కూడా ప్రవేశపెట్టబడ్డాయి.

### జ్ఞాపకాల సందడి...

20 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి అల్లర్లు, గురువులతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఎన్నేళ్ల తర్వాత స్నేహితులను కలవడం మరపురాని అనుభూతిగా భావించి ఆనందం వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో మళ్లీ కూర్చొని ఉత్సాహంగా గడిపారు. తమ కాలేజ్‌ను "అమ్మ"గా భావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.ఈ కార్యక్రమం కన్నులపండువగా సాగింది. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్, సంగీత కళాశాల బృందం, పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.





# జుట్టు విపరీతంగా ఊడిపోతుందా నిర్లక్ష్యం చేయొద్దు

- రోజూ 100 వెంట్రుకలు రాలడం సహజం
- అధికంగా ఊడితే ఆరోగ్య సమస్యలకు సంకేతం
- పోషకాహారం, జాగ్రత్తలతో నివారణ సాధ్యం



**డెస్క్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి)**: నేటి కాలంలో జుట్టు రాలడం సమస్య చాలా మందిలో సాధారణంగా కనిపిస్తోంది. సాధారణంగా రోజుకు 50 నుంచి 100 వెంట్రుకలు రాలడం సహజమే. కానీ దానికంటే ఎక్కువగా జుట్టు ఊడిపోతుంటే, ముఖ్యంగా దువ్వినప్పుడు పిడికిలి నిండా వెంట్రుకలు వస్తుంటే, దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఇది శరీరంలో ఉన్న అంతర్గత ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు. నిపుణుల ప్రకారం మహిళల్లో ఎక్కువగా జుట్టు రాలడానికి థైరాయిడ్ సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత ప్రధాన కారణాలుగా ఉంటాయి. శరీరంలో ఐరన్ లోపం లేదా రక్తహీనత ఉన్నా జుట్టు బలహీనమవుతుంది. అలాగే పి సి ఓ ఎస్ వంటి సమస్యలు కూడా జుట్టు రాలడానికి దారితీస్తాయి. ఈ పరిస్థితుల్లో జుట్టు కుదుళ్లు బలహీనపడి త్వరగా ఊడిపోతాయి. మానసిక ఒత్తిడి కూడా జుట్టు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఎక్కువ స్ట్రెస్, తక్కువ నిద్ర వల్ల జుట్టు వేగంగా రాలే అవకాశం ఉంటుంది. అదేవిధంగా రసాయనాలు అధికంగా ఉన్న ఉత్పత్తులు ఉపయోగించడం, తరచూ హెయిర్ స్టైలింగ్ చేయడం, జుట్టును బిగిగా కట్టడం వంటి అలవాట్లు కూడా జుట్టు నష్టానికి కారణమవుతాయి. జుట్టు రాలడాన్ని తగ్గించుకోవాలంటే సమతుల్యమైన ఆహారం తీసుకోవడం అత్యంత ముఖ్యం. ఐరన్, ప్రోటీన్, విటమిన్లు ఉన్న ఆహారం తీసుకోవాలి. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన నిద్ర తీసుకోవడం, జుట్టును సరిగా సంరక్షించుకోవడం అవసరం. సమస్య ఎక్కువకాలం కొనసాగితే వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండాకాలంలో ఆరోగ్యం కాపాడుకోవాలంటే జాగ్రత్తలు అవసరం

- డీహైడ్రేషన్ సమస్యలు పెరుగుతున్న వేళ
- శరీర ఉష్ణోగ్రతలు నియంత్రణకు చిట్కాలు
- సహజ పద్ధతులతో చల్లదనం పొందే మార్గాలు



**డెస్క్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి)**: ఎండాకాలం ప్రారంభమైన వెంటనే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పెరుగుతున్న ఎండల కారణంగా శరీరం డీహైడ్రేషన్‌కు లోనవుతూ అలసట, నీరసం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం, తగినంత ద్రవాలు తీసుకోవడం అత్యంత అవసరం అవుతోంది. శరీర ఉష్ణోగ్రతలను తగ్గించుకోవడానికి కొన్ని సహజ పద్ధతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. రోజూ తాటి బెల్లం కలిపిన నీళ్లు తాగడం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి చల్లదనం లభిస్తుంది. అలాగే ఉదయం కొబ్బరి నూనె లేదా పొద్దుతిరుగుడు నూనెతో మర్ధన చేసి స్నానం చేయడం ద్వారా కూడా వేడి తగ్గుతుంది. ఇంకా మెంతులు, సోంపు, జీలకర్ర, ధనియాలు వంటి సహజ పదార్థాలను ఉపయోగించడం ద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలను నియంత్రించుకోవచ్చు. రాత్రంతా నానబెట్టిన ఈ పదార్థాల నీటిని తాగడం లేదా మెంతుల పొడి గోరువెచ్చటి నీటితో తీసుకోవడం శరీరానికి చల్లదనం అందిస్తుంది. అదేవిధంగా ఎర్ర మందారం టీ, కుంకుమపువ్వు కలిపిన పాలు కూడా శరీర వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. దానిమ్మ గింజలు లేదా దానిమ్మ రసం కూడా శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహకరిస్తాయి. వేసవిలో వేడి పెంచే ఆహారాలను తగ్గించడం కూడా ముఖ్యమే. సరైన ఆహార అలవాట్లు, ద్రవాల వినియోగం ద్వారా ఎండాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని నిపుణులు సూచిస్తున్నారు.



# ఘనంగా కాకతీయ పొదుపు పరపతి సంఘం 33వ వార్షికోత్సవం



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 29,తరంగాలు :** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని భారతీయ కళా సమితి ఆవరణలో కాకతీయ పొదుపు పరపతి సంఘం 33వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షులు సమ్మెట శ్రీనివాస్ అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సంఘం ఆర్థిక కార్యదర్శి దొమ్మటి భానుచందర్ వార్షిక నివేదికను సభలో ప్రవేశపెట్టారు. సంఘం యొక్క ఆర్థిక పురోగతిని వివరిస్తూ.. గడిచిన ఏడాది కాలంలో జరిగిన ఆస్తిపాస్తులు, జమ ఖర్చుల వివరాలను ఆయన సభ్యులకు చదివి వినిపించారు. సంఘం బలోపేతానికి సభ్యులందరూ సహకరించాలని కోరారు.ఇదే వేదికపై సంఘం సభ్యుల నుండి మున్సిపల్ కౌన్సిలర్లుగా నూతనంగా ఎన్నికైన గుజ్జ వీరన్న, సిలువేరు కుమారస్వామిలను సంఘం కార్యవర్గం ఘనంగా సత్కరించింది. శాలువాలు కప్పి,వారిని అభినందించారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వీరు పట్టణ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని కార్యవర్గ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు


# గద్దర్ వేషధారణలో మెరిసిన ఎమ్మెల్యే కేఆర్‌నాగరాజు





- రవీంద్రభారతిలో సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకున్న ఎమ్మెల్యే నాగరాజు
- సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేల ప్రశంసలు

**హైదరాబాద్, మార్చి 29,తరంగాలు** :గద్దర్ వేషధారణలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మెరిశారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న "ఫస్ట్ ఎడిషన్ అఫ్ తెలంగాణ లెగిసాలేటర్స్ ' స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ -2026 కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని స్మరించుకుంటూ ఆయన ప్రత్యేక కళా ప్రదర్శన చేశారు. ఉద్యమంలో అసువులు బాసిన శ్రీకాంతాచారి, పోలీస్ క్రిష్ణయ్య త్యాగాలను గుర్తు చేస్తూ భావోద్వేగభరిత ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ప్రజా యుద్ధనౌక గద్దర్ పాత్రను ప్రతిబింబిస్తూ "పొడుస్తున్న పొద్దు" పాటకు అనుగుణంగా ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తదుపరి, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీ పాత్రను ప్రత్యేక స్కిట్ రూపంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నాగరాజు ను అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి గుర్తు చేస్తూ, సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు.



# ప్రతిరోజూ గుప్పెడు పల్లీలు తింటే అద్భుత ఫలితాలు

- పేదవాడి బాదంలో పోషకాల భాండారం
- కొలెస్ట్రాల్ తగ్గించి గుండెకు రక్షణ
- సరైన విధంగా తింటే ఆరోగ్యానికి మేలు



**డెస్క్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి):** మన వంటింట్లో సాధారణంగా కనిపించే పల్లీలు కేవలం టైమ్‌పాస్ స్నాక్ మాత్రమే కాదు, అవి అద్భుతమైన పోషకాల నిల్వగా నిలుస్తున్నాయి. చాలా మంది పల్లీలు తింటే కొలెస్ట్రాల్ పెరుగుతుందని భావిస్తారు. కానీ నిపుణుల ప్రకారం ఇది తప్పు అభిప్రాయం. వేరుశెనగలు రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. పల్లీలలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. అలాగే ప్లాంట్ స్టెరాల్స్ రక్తంలో కొలెస్ట్రాల్ చేరకుండా అడ్డుకుంటాయి. దీంతో ధమనుల్లో పూడికలు ఏర్పడే ప్రమాదం తగ్గి గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. వేరుశెనగల్లో ఉండే రెస్వెరాట్రాల్, ఒలిక్ ఆమ్లం వంటి పదార్థాలు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు కణాలను రక్షిస్తాయి. పీచుపదార్థం, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల బరువు నియంత్రణలో కూడా ఇవి సహకరిస్తాయి. అయితే పల్లీలను తినే విధానం చాలా ముఖ్యం. ఎర్రటి పొట్టుతో ఉన్న పల్లీల్లో ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి కాబట్టి పొట్టు తీసకుండా తినడం మంచిది. నూనెలో వేయించినవి, ఎక్కువ ఉప్పు కలిపినవి కాకుండా సాదాగా వేయించినవి లేదా ఉడకబెట్టినవి తీసుకోవాలి. రోజుకు 25 నుంచి 30 గ్రాముల వరకు మాత్రమే తీసుకుంటే శరీరానికి మేలు కలుగుతుంది అని నిపుణులు సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్ మీట్ ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది



- ఎల్బీ స్టేడియంలో క్రికెట్, వాలీబాల్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అద్భుత ప్రదర్శన

**హైదరాబాద్, మార్చి 29,తరంగాలు** : స్పోర్ట్స్ మీట్ ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి మరింత పెరుగుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న "ఫస్ట్ ఎడిషన్ అఫ్ తెలంగాణ లెగిస్లాటర్స్ ' స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ -2026" కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి వాలీబాల్, క్రికెట్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అద్భుతమైన బ్యాటింగ్ మరియు బౌలింగ్ ప్రదర్శిస్తూ అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని తెలిపారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడటమే కాకుండా పరస్పర స్నేహభావాన్ని కూడా పెంచుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలను ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు





# ఆలివ్ ఆయిల్ - నిమ్మరసం షాట్ ట్రెండ్ నిజంగా ప్రయోజనాలున్నాయా

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొత్త హెల్త్ హ్యాక్
- జీర్ణక్రియ, చర్మానికి మేలు చేస్తుందనే ప్రచారం
- వాడకంలో జాగ్రత్తలు అవసరమని నిపుణుల సూచన



**డెస్క్, మార్చి 29 (తరంగాలు ప్రతినిధి):** ప్రస్తుతం సోషల్ మీడియాలో హెల్త్ టిప్స్ హవా కొనసాగుతోంది. అందులో భాగంగా 'ఆలివ్ ఆయిల్ �  ఛ నిమ్మరసం షాట్' అనే కొత్త ట్రెండ్ విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. ప్రతిరోజూ ఉదయం చిన్న గ్లాసులో కొద్దిగా ఆలివ్ ఆయిల్‌కు నిమ్మరసం కలిపి తాగితే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పలువురు వెల్నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్లు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం ఆలివ్ ఆయిల్‌లో ఉండే పాలీఫెనాల్స్, ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి. నిమ్మరసంలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ రెండింటి కలయిక శరీరానికి యాంటీ ఆక్సిడెంట్ బూస్ట్‌లా పనిచేస్తుందని అంటున్నారు. అలాగే కొన్ని రకాల కిడ్నీ రాళ్లను నివారించడంలో కూడా ఇది ఉపయోగపడవచ్చని భావిస్తున్నారు. ఈ మిశ్రమాన్ని ఉదయాన్నే తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడం, మలబద్ధకం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. శరీరంలోని విషపదార్థాలు బయటకు వెళ్లి చర్మం కాంతివంతంగా మారుతుందని కూడా చెబుతున్నారు. అదేవిధంగా శరీరంలో వాపులు తగ్గి కీళ్ల నొప్పులు తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఈ హెల్త్ షాట్‌ను అందరూ ఒకే విధంగా తీసుకోవడం సరైంది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే కొందరిలో కడుపు సమస్యలు రావచ్చు. కాబట్టి చిన్న మోతాదులో ప్రారంభించడం, అవసరమైతే వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది. సహజ పదార్థాలతో ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలనుకునే వారికి ఇది ఒక ప్రత్యామ్నాయం అయినప్పటికీ, జాగ్రత్తలు పాటించడం అవసరం.

THARANGALU DAILY NEWS
బుధవారం, 11 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఇంద్రావతి అడవుల్లో సాహసోపేత రక్షణ





**గర్భిణిని భుజాలపై మోసిన ఐటిబిపి జవాన్లు**

**తల్లి-శిశువు సురక్షితం**

ఛత్తీస్‌గఢ్, మార్చి 29 : దూర ప్రాంతంలోని ఇంద్రావతి జాతీయ ఉద్యానవనం అడవుల్లో అరుదైన మానవతా ఘటన చోటుచేసుకుంది. అత్యవసర పరిస్థితిలో చిక్కుకున్న గర్భిణిని సమయానికి ఆసుపత్రికి చేర్చేందుకు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ బలగాల జవాన్లు అపార సాహసం ప్రదర్శించారు. ఈ ఘటన స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

బోటర్ గ్రామానికి చెందిన గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వెంటనే వైద్య సహాయం అవసరమైంది. అయితే ఆ గ్రామం సుదూర అటవీ ప్రాంతంలో ఉండటంతో వాహనాలు చేరలేని పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న ఐటిబిపి 29వ బెటాలియన్ జవాన్లు వెంటనే స్పందించారు.

అడవుల్లో దాదాపు ఐదు కిలోమీటర్ల దూరాన్ని కాలినడకన ప్రయాణించి గర్భిణిని భుజాలపై



మోసుకుంటూ ముందుకు కదిలారు. దట్టమైన అడవులు, క్లిష్టమైన మార్గాలు ఉన్నప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా తమ విధిని నిర్వర్తించారు. ఈ కృషి వల్ల సమయానికి వైద్య సహాయం అందించగలిగారు. తదుపరి ఏర్పాట్లలో భాగంగా గర్భిణిని రాండెవూ పాయింట్‌కు తీసుకువచ్చి, అక్కడి నుంచి ఆర్చా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం విజయవంతంగా పూర్తైంది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ఘటనలో ఐటిబిపి జవాన్ల సేవాభావం, కర్తవ్యనిబద్ధత ప్రతిఫలించింది. ప్రమాదకర పరిస్థితుల్లో కూడా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వారు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని మరోసారి రుజువైంది. ఇలాంటి సేవా కార్యక్రమాలు భద్రతా బలగాలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయి. కష్టకాలంలో ముందుండి సహాయం చేసే జవాన్లకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# గల్లంతైన తల్లి కొడుకుల మృతదేహాలు లభ్యం




- మామునూరు బెటాలియన్ ఎస్డిఆర్ఎఫ్ 21మంది సిబ్బందితో గాలింపు చర్యలు
- వర్ధన్నపేట ఎస్సై లు సాయిబాబు, రాజు పర్యవేక్షణలో సుమారు 8గంటలు ముమ్మరంగా గాలింపు

**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 29,తరంగాలు** :మండలంలోని కట్ర్యాల కు చెందిన మేకల లింగాలు దంపతుల చిన్న కుమార్తె కళ్యాణి (30)ని నాలుగేళ్ల క్రితం స్టేషన్ఘన్పూర్ కు చెందిన కామిండ్ల హరీష్ కు ఇచ్చి వివాహం చేశారు.

హరీష్ మామునూర్ ఫోర్త్ బెటాలియన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు శ్రేయన్స్ ఉన్నాడు.అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక శనివారం ఎస్సారెస్పీ కాలువలో మూడేళ్ళ కుమారుడు శ్రయాన్స్ తో కలిసి తల్లి దూకి ఆత్మహత్య కు పాల్పడిన విషయం తెలిసిందే.అయితే ఎస్సారెస్పీ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో తల్లి కొడుకులు గల్లంతయ్యారు.సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట పోలీసులు తల్లి కొడుకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.ఆదివారం వర్ధన్నపేట ఎస్సై లు సాయిబాబు, రాజు పర్యవేక్షణలో సుమారు 8గంటలు





మామునూరు బెటాలియన్ ఎస్డిఆర్ఎఫ్ 21మంది సిబ్బందితో ముమ్మరంగా రిస్క్యూటిమ్ గాలింపు చర్యలు చేపట్టగా కుమ్మరిగూడెం శివారులో తల్లి కళ్యాణి (30),కొడుకు శ్రయాన్స్ మృతదేహాలు లభ్యమయ్యాయి.తల్లి కొడుకుల మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందించిన్నట్లు పోలీసులు తెలిపారు.

# దళితుడు స్పీకర్ గా ఉన్నందుకే కేసీర్ సభకు రావడం లేదు

- దళితుల పట్ల బిఆర్ఎస్ పార్టీకీ చిన్న చూపు
- బిఆర్ఎస్ నేతలు యువకులకు ఆదర్శంగా ఉండాల్సిన వారు ఫామ్ హౌస్‌లు,పబ్బులు,మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు
- సీనియర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ని ఉద్దేశించి అనుచితంగా ప్రవర్తించడం సిగ్గు చేటు
- పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హైదరాబాద్ , మార్చి 29,తరంగాలు** : దళితుడు స్పీకర్ గా ఉన్నందుకే కేసీర్ సభకు రావడం లేదని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.ఆదివారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తాము నూతనంగా అసెంబ్లీకి ఎన్నికయ్యామని, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని, కెసిఆర్ మాట్లాడే విధానాన్ని చూస్తామని అనుకున్నామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పార్టీని నడిపిస్తున్నాడా, లేక పార్టీ అతడిని నడిపిస్తుందా తెలియట్లేదని, అతని ప్రవర్తన, శరీర హావభావాలు, వైఖరి ఒక రౌడీలాగా కనిపిస్తుందని, శాసనసభ్యుడిలా కనిపించడం లేదన్నారు.పాఠశాల పిల్లాడిలా ఫ్యాన్సీ పనులు చేస్తున్నారని, గతంలో స్పీకర్ పైన పేపర్లు విసిరేసారని అన్నారు. కడియం శ్రీహరి వరంగల్ జిల్లాలో పేరున్న నాయకుడు అని, పార్టీలకు అతీతంగా కడియం శ్రీహరికి వరంగల్ లో గౌరవం ఉందని కడియం శ్రీహరి ని ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తన చేయడం సరి కాదని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష సభ్యుల అభ్యర్థనను ఒప్పుకొని సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తామని చెప్పారని, అయినా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు.ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు స్పోర్ట్స్ పెడితే కూడా వారికి నచ్చదని, వారికి ఫామ్ హౌస్ లు, మత్తు పదార్థాలు, పబ్బులు అంటేనే ఇష్టమని, ఎంతోమందికి యువతకు ఆదర్శంగా నిలిచినా స్పోర్ట్స్ పెడితే స్పోర్ట్స్ లో బిఆర్ఎస్ పాల్గొనడం లేదన్నారు. వర్ధన్నపేట దళితులు ఎక్కువగా ఉండే నియోజకవర్గం అని, ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఒక్కొక్క సమస్యను సమన్వయంతో కలిసికట్టుగా పరిష్కరిస్తూ అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.దళితుల పట్ల బిఆర్ఎస్ పార్టీకి ఎందుకు చిన్న చూపు అర్థం కావడం లేదని, స్పీకర్ కుర్చీలో దళితులు కూర్చున్నారు.కాబట్టే కేసీఆర్ సభకు రావడం లేదనితాను భావిస్తున్నానన్నారు. పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## వేసవిలో శరీరానికి ఎంతో మేలు చేసే మిల్లెట్లు.. కచ్చితంగా రోజూ తీసుకోవాల్సిందే



ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శరీరాన్ని చల్లగా ఉంచే ఆహారాలను తీసుకోవడం, శరీరాన్ని సిద్ధం చేయడం అవసరంగా మారింది. చాలా మంది తీసుకునే ఆహారం శరీర అంతర్గత ఉష్ణోగ్రతపై ప్రభావం చూపడంతోపాటు, రికార్డు స్థాయిలో పెరుగుతున్న వేడిని తట్టుకునే సామర్థ్యాన్ని కూడా నిర్ణయిస్తుంది. భారతీయ వేసవి కాలాలు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అందువల్ల ముందస్తు జాగ్రత్తగా జొన్నలు, రాగులు వంటి మిల్లెట్లను ఆహారంలో చేర్చడం అవసరం. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు, మాక్రో, మైక్రో పోషకాలతో శరీరాన్ని పోషిస్తాయి. అంతేకాకుండా వేసవిలో మిల్లెట్ల వినియోగం పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. ఇవి తక్కువ కాలంలో పెరిగే పంటలు కావడంతోపాటు, తక్కువ నీటితో పెరుగుతాయి. పోషకాల సమృద్ధిగా ఉన్న ఈ ధాన్యాలు వేడిని తగ్గించడంలో సహాయపడటంతో పాటు, వేసవిలో సాధారణంగా కనిపించే అలసట సమస్యను కూడా తగ్గిస్తాయి.

### శరీరానికి చలువ చేస్తాయి..

సాధారణంగా మిల్లెట్లు శీతాకాలంతో సంబంధం ఉన్నవిగా భావించినప్పటికీ, కొన్ని రకాల మిల్లెట్లు సహజంగా చల్లదనాన్ని కలిగించే లక్షణాలు కలిగి ఉంటాయి. సరైన మిల్లెట్లను ఎంచుకుంటే శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటం, వేసవి అలసటను తగ్గించడం సాధ్యమవుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మిల్లెట్లు అధిక ఫైబర్, తేమను అందిస్తాయి. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. వేసవిలో వేడి కారణంగా జీర్ణక్రియ మందగించడం సాధారణం. ఈ నేపథ్యంలో మిల్లెట్లు తీసుకోవడం ప్రయోజనకరం. పరిశోధనలు కూడా మిల్లెట్ల వినియోగం ఆరోగ్యానికి మంచిదని సూచిస్తున్నాయి. వేసవిలో తీసుకోదగిన ఉత్తమ మిల్లెట్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### రాగులు, జొన్నలు, ఊదలు..

వేసవిలో తీసుకోవాల్సిన ఉత్తమ మిల్లెట్లలో రాగి ముఖ్యమైనది. గాఢ రంగులో ఉండటం వల్ల దీనిని హీటింగ్ ఫుడ్ గా భావిస్తారు. అయితే వాస్తవానికి ఇది శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండటంతో వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది. రాగి అంబలి, రాగి మాల్ట్ రూపంలో తీసుకోవడం మంచిది. అలాగే రాగితో ఇడ్లీ, దోశలు తయారు చేసుకోవచ్చు. జొన్నలు కూడా వేసవికి అనుకూలమైన ధాన్యం. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచవు. పొటాషియం, ఫాస్పరస్ అధికంగా ఉండటం వల్ల చెమట ద్వారా కోల్పోయే ఎలక్ట్రోలైట్‌లను భర్తీ చేస్తాయి.